సాక్షి ప్రకాశం

శనివారం, 2, మార్చి, 2024



వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం

తర్లుపాడులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది.

- IIలో..



174 మంది ఏహెచ్‌ఏల నియామకం

ఆర్బీకేల పరిధిలో నూతనంగా నియమితులైన ఏహెచ్‌ఏలకు కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ నియామక పత్రాలు అందించారు.

- IIలో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34/23

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రభుత్వం భరోసా

- జగనన్న విద్యాదీవెన పథకంతో ఉత్తమ భవిత
- 2023 త్రైమాసికంలో 47,422 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.36.44 కోట్లు జమ



విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పేద విద్యార్థులు పేదరికంతో ఉన్నత చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించి ఆర్థికంగా ఆదుకుంటోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం నిర్వహించిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో డబ్బులు జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి రమణమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, డీటీడబ్ల్యూ జగన్నాథరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజనీదేవి, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. పథకం తాలూకు మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం కింద అక్టోబర్, డిసెంబర్ 2023 త్రైమాసికానికి సంబంధించి 47,422 మంది విద్యార్థులకు సంబంధించి రూ.36.44 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజిలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజులు మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏటా ఏ త్రైమాసానికి ఆ త్రైమాసం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లులు, విద్యార్థుల ఉమ్మడి ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారన్నారు. అందులో భాగంగా విడుదల చేసిన నిధుల్లో 12,460 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.8.54 కోట్లు, 1107 మంది ఎస్టీలకు రూ.75 లక్షలు, 15,774 మంది బీసీలకు రూ.11.39 కోట్లు, 12,250 మంది ఈబీసీలకు రూ.11.40 కోట్లు, 3006 మంది ముస్లిం మైనార్టీలకు రూ.2.10 కోట్లు, 2768 మంది కాపులకు రూ.2.20 కోట్లు, 57 మంది క్రిస్టియన్ మైనార్టీలకు రూ.5.27 లక్షలు కలిపి మొత్తం 47,422 మంది విద్యార్థులకు రూ.36.44 కోట్ల సొమ్ము ప్రభుత్వం జమ చేసిందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యపై భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేయడంతో పదో తరగతి, ఇంటర్ చదువుతో ఆపేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, కాపు, పేద వర్గాల పిల్లలకు అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన పథకాన్ని ఆయా వర్గాల పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

మిర్చి..కలిసొచ్చె..

మిర్చిసాగు రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. మార్కెట్లో మంచి ధరలు పలుకుతుండడంతో రైతులు లాభాలపై ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది సైతం అధిక ధరలు రావడంతో ఈ దఫా సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. జిల్లాలో గత సంవత్సరం సాగు విస్తీర్ణం 75 వేలు కాగా, ప్రస్తుతం 95 వేల ఎకరాల్లో పండిస్తున్నారు. దిగుబడి తగ్గినా రేట్లు ఎక్కువగా ఉండడంతో రైతుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తోంది.



ముండ్లమూరులో కళ్లంలో ఆరబోసిన మిరప

- విస్తారంగా మిర్చి సాగు
- గతేడాది లాభాలు తెచ్చిన ఎర్రబంగారం
- జిల్లాలో సాగు విస్తీర్ణం 95,128 ఎకరాలు
- గత ఏడాదితో పోలిస్తే అదనంగా 20 వేల ఎకరాల్లో సాగు
- ఎకరానికి రూ.2.25 లక్షల వరకూ వ్యయం
- దిగుబడి తగ్గటంతో ఎకరానికి రూ.1.85 లక్షల వరకు మిగులు
- ధరలు పెరిగే అవకాశం ఉందంటున్న అధికారులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని మిరప రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాది లాభాలు తెచ్చిపెట్టిన మిర్చి సాగుపై రైతులు ఆసక్తి చూపించారు. ఈసారి 20 వేల ఎకరాల్లో అధికంగా సాగు చేశారు. గతేడాది 75 వేల ఎకరాల వరకు సాగుచేయగా, ఈ సంవత్సరం సుమారు 95 వేల ఎకరాల్లో మిర్చి పండిస్తున్నారు. గత సంవత్సరం ఎకరానికి సరాసరి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో క్వింటాలు ఎండు మిర్చి ధర రూ.25 వేల వరకు ఉండటంతో అధిక మొత్తంలో లాభాలు ఆర్జించారు. పురుగు మందులు, కూలీ ఖర్చులు పోను కనిష్ఠంగా రూ.4.60 లక్షల వరకు మిగిలాయి. గత ఏడాది అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను కూడా ప్రభుత్వం బీమా నగదు ఇచ్చి ఆదుకుంది. దీంతో అధిక సంఖ్యలో మిర్చి పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఎకరాకి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుత ధర రూ.20,500 నుంచి రూ.22 వేల మధ్య పలుకుతోంది. ఎకరాకు రూ.4.10 లక్షల వరకు రాబడి ఉండగా రూ.2.25 లక్షల వరకు ఖర్చు పోను రూ.1.85 లక్షల వరకు మిగులుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తాలు కాయలు ఎక్కువగా వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అయితే గత ఏడాది అధికంగా ధరలు రావడంతో ఎర్ర బంగారం సాగుకు రైతులు ఆసక్తి చూపారు. జిల్లాలో 95,128 ఎకరాల్లో మిరపను సాగు చేస్తుండగా ఎక్కువగా మార్కాపురం యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో పండిస్తున్నారు.

నర్సరీలు ఇలా...

జిల్లాలో మొత్తం 205 నర్సరీలు ఉండగా పశ్చిమ ప్రకాశంలోనే 160 నర్సరీలున్నాయి. ఇందులో బేస్తవారిపేటలో 25, కొమరోలులో 27, మార్కాపురంలో 6, పుల్లలచెరువులో 15, పెద్దారవీడులో 20, త్రిపురాంతకంలో 19, యర్రగొండపాలెంలో 9, గిద్దలూరులో 13, కంభం 3, దర్శిలో 6 నర్సరీలు, కొనకనమిట్లలో 10 నర్సరీలు ఉన్నాయి. రైతులకు పెద్ద మొత్తంలో మిరప నారును అందించాయి. జిల్లాలో ఎక్కువగా తేజ, ఆర్మూరు, బ్యాడీ, జీని 26 26, 341 రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు 12 వేల నుంచి 14 వేల మొక్కలు నాటుతున్నారు. రకాన్ని బట్టి మొక్క 1.50 నుంచి 2 రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా మిరప సాగు ఇలా..

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
యర్రగొండపాలెం	39544.65
మార్కాపురం	14253.22
గిద్దలూరు	13949.97
కనిగిరి	3960.62
దర్శి	12433.15
సంతనూతలపాడు	4694.61
కొండపి	5534.18
ఒంగోలు	757.93
మొత్తం	95,128.33

ఎకరానికి రూ.1.50 లక్షలు మిగులు



వర్షాలు ఎక్కువగా పడటంతో కొంత మేర నష్టపోయాం. తాలు ఎక్కువగా వస్తోంది. కూలీలకు డిమాండ్ ఉంది. నాలుగు ఎకరాలు సాగు చేశాను. కాయలు, తాలు పోను ఎకరానికి రూ.1.50 లక్షల వరకు మిగులు ఉంటుంది. ధర పెరిగితే మరికొంత మేలు జరిగే అవకాశం ఉంది.

– ఎస్ వెంకటేశ్వర్లు, యు.ఎం.పురం, ముండ్లమూరు మండలం

జిల్లాలో విస్తారంగా సాగు



జిల్లాలో మిరప గత ఏడాది 75 వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 95,128.33 ఎకరాలు సాగు చేశారు. వర్షాల వలన కొంత మేర తెగుళ్ల రావటంతో ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేశాం. దిగుబడి కొంత తగ్గి తాలు పెరిగింది. అయితే ధర కూడా హెచ్చతగ్గులు ఉన్నాయి. మంచి మార్కెట్ ఉంది కనుక ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉంది.

– వై గోపిచంద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, ఒంగోలు

రొయ్యల సాగుకు అనుమతి తప్పనిసరి

- కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తీసుకోవాలి
- సీఏఏ డైరెక్టర్ శంకరరావు



మాట్లాడుతున్న సీఏఏ డైరెక్టర్ శంకరరావు

ఒంగోలు సెంట్రల్: రొయ్యల సాగు చేసే ప్రతి రైతు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ ఆఫ్ ఇండియా (సీఏఏ) అనుమతి తీసుకోవటం తప్పనిసరి అని సీఏఏ డైరెక్టర్ శంకరరావు అన్నారు. ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద ఉన్న డీఎల్‌డీఏ సమావేశపు హాల్‌లో శుక్రవారం రొయ్యల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆక్వాకల్చర్ రైతులకు సంఘ అధ్యక్షుడు దుగ్గినేని గోపినాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఏఏ డైరెక్టర్ శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ చట్టం 2005కు సవరణ చేశారని చెప్పారు. నూతన మార్గదర్శకాలు, ఆక్వా రైతులకు అనుకూలంగా ఉండే నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 9 నుంచి ఈ చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్ రెడ్డి, హేచరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రాజు, రొయ్యల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంతూరి సుబ్బా రెడ్డి, పొల్యూషన్ శాఖ ఏఈ భాస్కర్ శర్మ, మత్స్యశాఖ ఏడీ ఉషా కిరణ్, ఎఫ్‌డీఓ రవికుమార్, సీఏఏ అధికారులు రమేష్, రామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఏఏ డైరెక్టర్ శంకరరావు రొయ్యల రైతుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఇది మహిళా ప్రభుత్వం

- కొత్తపట్నం మండలంలో ఏడాదికి రూ.9,43,54,403 డ్వాక్రా గ్రూపు సభ్యుల అకౌంట్‌లో జమ
- నాలుగేళ్లలో రూ.37,74,76,228 నగదు జమ
- టీడీపీ ప్రభుత్వంలో పసుపు కుంకుమ పేరుతో ఇచ్చింది రూ.6.35 కోట్లు మాత్రమే
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి

కొత్తపట్నం: ఇది మహిళా ప్రభుత్వమని, అన్ని పథకాలు నేరుగా మీ అకౌంట్‌లో జమచేసి మీ కుటుంబాలు అభివృద్ధి చేయటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశల కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నాల్గొవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మండలంలో మహిళలకు ఏ సమస్య వచ్చినా నేనున్నానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా అకౌంట్‌లో జమ చేశారని చెప్పారు. అందులో భాగంగా మండలంలో 1,211 డ్వాక్రా గ్రూపులు ఉండగా ఒక్కో ఏడాదికి రూ.9,43,54,403 చొప్పున నాలుగేళ్లలో రూ. 37,74,76,229 నగదును నేరుగా మహిళల అకౌంట్‌లో జమచేశారని తెలిపారు.

టీడీపీ ప్రభుత్వంలో రూ.6.35 కోట్లు

టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలకు బ్యాంక్‌లో ఉన్న బకాయిలన్నీ రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు ఒక్కరికి కూడా రద్దు చేయకుండా వారిని నిలువునా ముంచారని గుర్తు చేశారు. పసుపు కుంకుమ పేరుతో ఒక్కొక్కరికి నామమాత్రంగా డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు మండలంలో కేవలం రూ.6.35 కోట్లు ఇస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.37.74 కోట్లు డ్వాక్రా మహిళకు ఇచ్చారని చెప్పారు.

రూ.2.75 కోట్లతో కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌కు రోడ్డు:

కొత్తపట్నం మార్కెట్ యార్డ్ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు రోడ్డుకు రూ.2.75 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. ఆక్రమణలు తొలగించిన తరువాత బస్టాండ్ ఎంతో బాగుందని, మీరందరి సహకారంతో రోడ్డు పనులు చేయటం అభినందనీయమన్నారు. ఒంగోలులో రూ.230 కోట్లతో 25 వేల మంది ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, అందులో భాగంగా కొత్తపట్నం మండలంలో మిగిలిన గ్రామాల్లో వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చే ఏర్పాటు చేస్తానని చెప్పారు.

బకింగ్‌హామ్ బ్రిడ్జి టీడీపీ ప్రభుత్వంలోనే ఆగిపోయింది:

బకింగ్‌హామ్ బ్రిడ్జి పనులు టీడీపీ ప్రభుత్వంలోనే ఆగిపోయాయని, వారికి ఇచ్చిన సమయానికి పూర్తి చేయకపోవడంతో కేంద్రం నిధులు తిరిగి వెళ్లాయన్నారు. దానికి అయ్యే ఖర్చు నా సొంత డబ్బులు పెట్టుకుని గ్రావెల్ వేయించి వాహనాలు తిప్పుతున్నానని తెలిపారు.. పది రోజుల్లో రూ.40 లక్షలు వెచ్చించి రోడ్డు పూర్తి చేసి వాహనాలు రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తానని చెప్పారు.

ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఎంత రుణం ఉందో అంత ఇస్తానని సీఎం చెప్పిన విధంగా మీ అకౌంట్‌లో జమ చేశారన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో కొత్తపట్నానికి రెండు సీసీ రోడ్లు వేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 25 సీసీ రోడ్లు వేశారన్నారు. మాజీ ఎంపీపీ వాయల మోహన్ రావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఇంత మంది వస్తారని మేము ఊహించలేదన్నారు. మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేయటం ఇదే ప్రథమం అన్నారు. అందరూ బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. నాల్గో విడత రూ.9,43,54,403 చెక్కును బాలినేని శ్రీనివాస రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ సురేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర చెక్కు పంపిణీ చేశారు. జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ ఆసరా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార వెల్‌ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, మండల ఉపాధ్యక్షుడు శెట్టి కోటేశ్వరమ్మ, తాతా ఉమామహేశ్వరి, పిచ్చిరెడ్డి, తంబి కాంతారావు, ఎంపీటీసీ సభ్యులు సీహెచ్ తిరుపతమ్మ, గుడి అరుణ, పురిణి వెంకట్రావు, ఉప్పుటూరి కోటేశ్వరావు, సర్పంచ్‌లు కోడూరి గోపి, విశ్వనాథపల్లి ఆనందరావు, కొండూరి పోలమ్మ, పూనూరి శైలేష్, గంగవరపు కోటేశ్వరరావు, రాజుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, ఏపీఎం రజీయా సుల్తాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు రూ.9.43 కోట్ల చెక్కు పంపిణీ చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి, సురేష్, వసుంధర

జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఏకేవీకే కాలేజ పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ పరీక్షకు హాజరైన విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద బోర్డుపై రూం నంబర్ చూసుకుంటున్న ఇంటర్ విద్యార్థినులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ దినేష్ కుమార్
- తొలి రోజు పరీక్షకు 1447 మంది విద్యార్థులు గైర్హాజరు
- జిల్లాలో 59 సెంటర్లను తనిఖీ చేసిన అధికారులు

ఒంగోలు/ఒంగోలు సబర్బన్: జూనియర్ ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. ప్రశ్న పత్రాలను స్టోరేజీ పాయింట్ల వద్ద నుంచి రిసీవ్ చేసుకోవడం మొదలు పరీక్షా కేంద్రానికి చేరే వరకు పోలీసులు భద్రత చేకూర్చారు. 8.30 గంటలకే పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులకు అనుమతించారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలో ఇద్దరు ఇన్విజిలేటర్లు ఉండేటట్లుగా చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి గదిలోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యా కమిషనర్ కార్యాలయం నుంచే నేరుగా పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించేలా సీసీ కెమెరాలు అమర్చారు. తొలి రోజు పరీక్ష సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉదయం విద్యార్థులు వివిధ ప్రార్థనా మందిరాల్లో పూజలు చేశారు. పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు కూడా వెంట వచ్చి పిల్లలు పరీక్ష కేంద్రంలోకి వెళ్లే వరకు ఉన్నారు. జూనియర్ ఇంటర్ ద్వితీయ భాష పరీక్షకు సంబంధించి జిల్లాలోని 38 మండలాల్లో 69 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.

జనరల్ విభాగంలో 20,295 మందికిగాను 19,233 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2539 మందికిగాను 2154 మంది మాత్రమే హాజరయ్యారు. మొత్తంగా 22,834 మందికిగాను 21,387 మంది హాజరు కాగా, 1447 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్థానిక నారాయణ జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును, విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. మంచినీటి సౌకర్యం, ఏఎన్ఎం ఉన్నారా లేదా అంటూ పరిశీలించారు. ఇన్విజిలేటర్లకు ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. పరీక్షల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం కనిపించినా సహించేదిలేదని స్పష్టం చేశారు. పరీక్షల కేంద్రం వద్ద ఎట్టి పరిస్థితులలోను జనం పోగవకుండా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. మరో వైపు ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ ఆరు పరీక్ష కేంద్రాలను, డీఈసీ సభ్యులు, డీఐఈవో మరో 14 కేంద్రాలను, స్క్వాడ్లు 38 పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశాయి. అనంతరం ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ మాట్లాడుతూ తొలి రోజు పరీక్ష పూర్తిగా ప్రశాంతంగా జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియేట్ పరీక్షలకు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ మేరకు ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి మంగళవారం విడుదల చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జెరాక్స్ సెంటర్లను పూర్తిగా మూసేశామని వెల్లడించారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోనికి పంపిస్తున్నామని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఎవరైనా లిఫ్ట్ అడిగితే వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి వారు పోలీసులను ఆశ్రయించినా పరీక్ష కేంద్రాల వద్దకు తమ వాహనాలపై తీసుకెళతారని ఎస్పీ పేర్కొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు

- వలంటీర్లకు సేవా పురస్కారాలు, పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ఇంటి పట్టాలు అందిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు వంటి వారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా పేద లబ్ధిదారులకు అందించటంలో వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వారు చేస్తున్న సేవలకు గుర్తుగా ఏటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులతో సత్కరించే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఆనవాయితీగా వస్తోందన్నారు. దానిలో భాగంగా చీమకుర్తి మండల రూరల్ పరిధిలోని వలంటీర్లకు సేవా పురస్కారాలను అందించి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం జగనన్న కాలనీల్లోని పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను మేరుగు నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో మేరుగు నాగార్జున సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని.. ఆయన్ను గెలిపించి మరోసారి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయాలని స్థానిక పార్టీ నాయకులకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వెలిగొండ'ను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కొత్తూరు వద్ద చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ ప్రాంతాన్ని అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ పనులను పరిశీలించి జాతికి అంకితం చేసేందుకు కొత్తూరు ప్రాంతానికి రానున్న నేపథ్యంలో అడిషనల్ ఎస్పీతో పాటు పలువురు పోలీసు అధికారులు ప్రాజెక్టును శుక్రవారం సందర్శించారు. అధికారులు తొలుత హెలిప్యాడ్, పైలాన్‌లను, అనంతరం రెండు సొరంగ నిర్మాణ పనుల ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ బాలసుందరం, యర్రగొండపాలెం, కంభం సీఐలు రాములు నాయక్, రామకోటయ్య, ఎస్సై అంకమరావుతో పాటు ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

క్లుప్తంగా

టెట్ పరీక్షకు 63 మంది గైర్హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) పరీక్షకు శుక్రవారం 63 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఒంగోలులోని నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చి యాక్షన్ ఇండియా, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 393 మంది అభ్యర్థులకుగాను 358 మంది, సాయంత్రం సెషన్‌లో 393 మందికిగాను 365 మంది హాజరయ్యారని డీఈఓ డి.సుభద్ర వివరించారు.

రైలు నుంచి జారి పడి యువకుడికి తీవ్ర గాయాలు

గిద్దలూరు రూరల్: రైలు నుంచి జారి పడటంతో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. రుద్రవరం మండలానికి చెందిన నాగార్జున అనే యువకుడు గుంటూరు నుంచి కాచిగూడ రైలులో వస్తుండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి కాలు పూర్తిగా విరిగిపోయింది. సమాచారం అందుకున్న నంద్యాల జీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని క్షతగాత్రుడిని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని మార్కాపురం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు.

నూతన క్రిమినల్ చట్టాలపై సదస్సులో ఏపీపీ


ప్రశంస పత్రం అందుకుంటున్న ఏపీపీ నాయక్

మార్కాపురం టౌన్: హైదరాబాద్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గతనెల 26 నుంచి ఈనెల 1వ తేదీ వరకు నిర్వహించిన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సుకు మార్కాపురం జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలూనాయక్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, ఒడిశా, పాండిచ్చేరి, కేరళ తదితర రాష్ట్రాల నుంచి ఐపీఎస్ అధికారులు, డీఎస్పీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మొత్తం 50 మంది సదస్సులో పాల్గొన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలపై అవగాహన కల్పించినట్లు ఏపీపీ నాయక్ తెలిపారు. ట్రైనింగ్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ నుంచి ఏపీపీ ప్రశంస పత్రం అందుకున్నారు.

రోబో వైద్యం.. మోకీలు నొప్పి మాయం!

- గుంటూరులో అత్యాధునిక పద్ధతిలో మోకీలు ఆపరేషన్లు
- రోబోటిక్ సర్జరీతో నూరు శాతం సత్ఫలితాలు
- ఆధునిక చికిత్సతో మోకాళ్ల నొప్పులకు చెక్
- యుక్త వయస్కుల్లోనూ కీళ్ల నొప్పులు
- ముందస్తు జాగ్రత్తలతో నివారణ సాధ్యమంటున్న వైద్యులు



ఒంగోలు టౌన్: వైద్య రంగంలో ఆధునిక సాంకేతికత పరుగులు పెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వైద్య రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలుకుతున్న వైద్యులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు పోటీ పడుతున్నారు. అందులో భాగంగా లాపరోస్కోపీ ఆపరేషన్లు, కీ హోల్ సర్జరీలు, లేజర్ సర్జరీలను విరివిగా వినియోగిస్తున్నారు. ఇపుడు వీటికి మించి మరింత మెరుగైన వైద్య సేవలను రోగులకు అందించేందుకు రోబోటిక్ సర్జరీలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే మెడికల్ హబ్‌గా గుంటూరు గుర్తింపు తెచుకుంది. ఈ క్రమంలోనే మెట్రోపాలిటన్ నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న రోబోటిక్ సర్జరీలను ఇక్కడ కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

యుక్త వయసులోనే కీళ్ల నొప్పులు

సహజంగా కీళ్ల నొప్పులు జీవన మలి సంధ్యలో చేరుకున్న తర్వాత వృద్ధాప్యంలో వేధించేవి. మారిన ఆధునిక జీవనశైలి పుణ్యమా అని యుక్త వయసులోనే కీళ్ల అరుగుదల సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. కీళ్ల నొప్పులతో బాధపడుతూ పలువురు యువకులు వైద్యులను సంప్రదించడం నిత్యకృత్యమైపోయింది. ప్రపంచ వ్యాప్తంగా 200 మిలియన్ల మంది కీళ్ల అరుగుదలతో బాధ పడుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి రోజూ వివిధ రకాల సమస్యలతో ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి 300 మంది వస్తుండగా వీరిలో 30 శాతానికి పైగా ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్నవారు ఉంటున్నారు. జిల్లాలో 140 ఆర్థోపెడిక్ ప్రైవేట్ వైద్యశాలు ఉన్నాయి. ఇక్కడకు వచ్చేవారిలో సైతం 30 శాతం మందికి పైగా ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్న వారు ఉంటున్నారు. కీళ్లు అరిగిపోయి నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్యులు మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. వైద్యులు చేస్తున్న ఆపరేషన్లలో 2 నుంచి 3 శాతం ఏదైనా సమస్యలు ఎదురుకావచ్చు. కానీ రోబోటిక్ ఆపరేషన్లతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు. నూరు శాతం కచ్చితత్వంతో ఆపరేషన్లు చేసే అవకాశం ఉంది. దీంతో ఇప్పుడు రోబోటిక్ ఆపరేషన్ల వైపు వైద్యులు మొగ్గు చూపుతున్నారు.

ముందస్తు చర్యలతో నివారణ సాధ్యమే..

చిన్న వయసులోనే కీళ్ల అరుగుదలకు పొగతాగడం, స్థూలకాయం ప్రధాన కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. అయితే 55 లేళ్ల పైబడిన వారిలో స్థూలకాయంతోపాటుగా గతంలో కీళ్లకు గాయాలు కావడం, కీళ్ల వాతం, మహిళల్లో రుతుక్రమం ఆగిపోయిన(మోనోపాజ్) వారిలో సహజంగా కీళ్ల అరుగుదల ఉంటుంది. క్రమబద్ధమైన వ్యాయమం చేయడం, అధిక శాతం కూరగాయలు, పండ్లు, విటమిన్-డి, కాల్షియం అధికంగా లభించే పాల ఉత్పత్తులు, చేపలను ఆహారంగా తీసుకోవడం ద్వారా కీళ్ల సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు వైద్యులు.



రోబోటిక్ సర్జరీతో నూరు శాతం కచ్చితత్వం



మెట్రోపాలిటన్ నగరాల్లో లభించే ఆధునిక మోకీలు సర్జరీలను గుంటూరు ప్రజలకు చేరువ చేసేందుకు రోబోటిక్ సర్జీలను అందుబాటులోకి తీసుకొచ్చాం. సాధరణంగా వైద్యులు చేసే ఆపరేషన్లలో 2 నుంచి 3 శాతం ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడవచ్చు. అయితే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రోబోటిక్ ఆపరేషన్లు చేస్తున్నాం. దీని వల్ల నూటికి నూరు శాతం కచ్చితత్వం ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు లాంటివి సోకవు. రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. నొప్పి ఉండదు. రోగి త్వరగా కోలుకుంటారు. ఈ ఆపరేషన్ల వల్ల జాయింట్ల కాలపరిమితి ఎక్కువ కాలం ఉంటుంది. ఇన్సూరెన్స్ కార్డులు ఉన్న వారికి ఉచితంగా రోబోటిక్ ఆపరేషన్లు చేస్తున్నాం

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్

నా బలం జగన్... నా బలగం మీరే..

- మార్కాపురంలో వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే అన్నా


పార్టీ శ్రేణులతో కలిసి గొర్లగడ్డలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ అన్నా రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని గొర్లగడ్డ, మసీదు వీధి తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. వార్డు కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ‘నా బలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్, నా బలగం వైఎస్సార్ సీపీ శ్రేణులే’ అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో మార్కాపురం టౌన్‌ను మోడల్‌గా మారుస్తానని, అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వార్డులో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎంసీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఆసిఫ్‌ఖాన్, పత్తి కృష్ణ, నజీర్ అహ్మద్, ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మగ్బుల్‌బాషా, అమీరుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


పూజలు చేస్తున్న అన్నా రాంబాబు తదితరులు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన రథంపైన ఉభయ దేవేరులు, స్వామివారి ఉత్సవమూర్తులను అర్చకులు ప్రతిష్ఠించారు. వివిధ రకాల బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో తర్లుపాడు వీధులు మారుమోగాయి.

వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఆయన తనయుడు కృష్ణచైతన్యలు, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి కొబ్బరికాయ కొట్టిన తర్వాత భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ ఆధ్వర్యంలో సీఐ మల్లికార్జున్, స్థానిక ఎస్సై వేముల సుధాకర్‌తోపాటు మరో నలుగురు ఎస్సైలు, పలువురు కానిస్టేబుళ్లు, స్పెషల్‌పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

భక్తులకు అన్నదానం

స్వామివారి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొళ్ళట్టి జగన్‌బాబు ఆధ్వర్యంలో తర్లుపాడులోని రథంబజారులో అన్న సంతర్పణ చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ అబ్దుల్ హమీద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ పి.వరాలు, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ అంకమ్మ, సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు సత్వరమే పరిష్కరిస్తాం

- సీఈసీకి తెలిపిన కలెక్టర్ దినేష్‌కుమార్


సీఈసీ వీడియో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జేసీ, డీఆర్వో

ఒంగోలు అర్బన్: ఓటరు జాబితాకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన క్లెయిమ్‌ల్లో వారం రోజులు దాటినవి 6200 ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్లతో సీఈసీ వీడియో సమావేశం నిర్వహించి సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ప్రకాశం భవనం నుంచి జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్‌ఓ శ్రీలత తదితరలు పాల్గొన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్‌ఎస్‌టీ, వీవీటీ టీమ్‌లకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బు పట్టుబడితే వాటిని అప్పటికప్పుడే సేఫ్ కస్టడీ కోసం డిపాజిట్ చేసేలా అన్ని బ్యాంకుల వివరాలను ఈఎస్ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని సీఈఓ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన కనీస మౌలిక సదుపాయాలను మరోసారి తనిఖీ చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఫొటో గుర్తింపు కార్డులు త్వరగా పంపిణీ చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు, నోడల్ అధికారుల నియామకం తదితర అంశాలపై సీఈఓ సమీక్షించారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

1.85 లక్షల మందికి పింఛను


చింతలలో పెన్షన్ అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ వసుంధర, సచివాలయ సిబ్బంది

ఒంగోలు టౌన్: జిల్లాలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మొదలైంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవ్వా తాతలు, దివ్యాంగులు, వితంతువులకు పింఛను అందజేశారు. మొత్తం 2,94,891 మంది లబ్ధిదారులకుగాను తొలిరోజు 1,85,356 మందికి పింఛను సొమ్ము పంపిణీ చేశారు. కొత్తపట్నం మండలంలోని చింతల గ్రామంలో లబ్ధిదారులకు డీఆర్డీఏ పీడీ టి.వసుంధర నగదు అందజేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక సహాయ ప్రాజెక్ట్ అధికారి జీవీ వరప్రసాద్ జిల్లాలోని టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలల్లోని పలు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు. రాత్రి 9 గంటల వరకు 63 శాతం పంపిణీ పూర్తయిందని డీఆర్డీఏ పీడీ చెప్పారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛను పంపిణీ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

వెలిగండ్ల: రెండు పొగాకు బ్యారన్లు ప్రమాదవశాత్తు దగ్ధం కావడంతో రైతులకు సుమారు రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఈ సంఘటన శుక్రవారం వెలిగండ్ల మండలం బాపనపల్లిలో చోటుచేసుకుంది. వెలిగండ్లకు చెందిన అనిశెట్టి చౌడయ్య బాపనపల్లిలో పొగాకు బ్యారన్ అద్దెకు తీసుకుని క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నికీలలు పక్కనే ఉన్న మరో బ్యారన్ కూడా వ్యాపించడంతో పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసినా ఫలితం లేకుండా పోయింది.


పచ్చ నేతలు చెప్పడానికి ఏముంది?


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

- ఏ ముఖం పెట్టుకొని వాళ్లు గ్రామాల్లోకి వస్తారు?
- సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామ రక్ష
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ‘తెలుగుదేశం నాయకులకు చెప్పుకోవడానికి ఏముంది. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జన్మభూమి కమిటీల చరిత్ర తప్ప. ఇటువంటి పరిస్థితుల్లో వాళ్లు ఏ ముఖం పెట్టుకొని గ్రామాల్లోకి వస్తారు’ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక మాచర్ల రోడ్డులోని తాటిపర్తి క్యాంప్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బూత్ కమిటీలు, గృహ సారథులు, పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాల పేద ప్రజల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని, కోవిడ్ కష్టకాలంలోనూ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందాయో లేదో తెలుసుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేలను ధైర్యంగా గడపకు గడపకూ పంపారన్నారు. నాడు–నేడుతో పాఠశాలలు, ఆస్పత్రులు కార్పొరేట్‌కు దీటుగా మారాయన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ క్లినిక్‌లు అభివృద్ధికి దర్పణంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. తమ పార్టీవాళ్లకే కండువాలు కప్పి గప్పాలు కొట్టుకోవడం పచ్చనేతలకే చెల్లుతుందని, అలాంటి స్వభావం తమకు లేదని చురకలంటించారు. పార్టీ అభివృద్ధికి పాటుపడిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పటికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహ సారథులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరు తమ పరిధిలో పోలింగ్ ముగిసే వరకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ఓటు లేని వారిని గుర్తించి ఎక్కువ సంఖ్యలో నమోదు చేయించిన వారిని సన్మానించుకుందామని, ఆర్థిక సహాయం కూడా చేద్దామన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, మెజారిటీలో మరో పులివెందుల కాబోతోందన్నారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయ భాస్కర్, త్రిపురాంతకేశ్వర దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, ఏఎంసీ డైరెక్టర్లు కందుల సత్యనారాయణ, కె.జయరావు, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయండి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం: అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వివిధ శాఖల అధికారులను సబ్ కలెక్టర్ రహుల్‌మీనా ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఐటీడీఏ, అటవీ, గిరిజన సంక్షేమం, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో అటవీ హక్కుల చట్టం అమలుపై సమీక్షించారు. గిరిజనులకు ఇళ్ల స్థలాలు, పొలాలు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లోని అక్కపాలెంలో ఉన్న 73 మందికి 2.66 ఎకరాలు, గారపెంటలో ఉన్న 245 మంది చెంచులకు 7.38 ఎకరాలు, మురికిమళ్ల చెంచుగూడేల్లో ఉన్న 33 మందికి 1.15 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు, యర్రగొండపాలెం మండలంలోని చెర్లోచెంచుగూడెంలో ముగ్గురికి 12 సెంట్లు, నెక్కంటిలోని 12 మంది గిరిజనులకు 48 సెంట్లు ఇవ్వాల్సి ఉందని అధికారులు వివరించారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ సర్వే నిర్వహించి పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీఓ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి, దోర్నాల సబ్ డీఎఫ్ఓ వేణు, ఏటీడబ్ల్యు ఎస్.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు భూమని ఆవులయ్య, బాలమ్మబాయి, నాగార్జుననాయక్‌తోపాటు అర్ధవీడు, దోర్నాల, గిద్దలూరు, పుల్లలచెరువు, యర్రగొండపాలెం తహసీల్దార్, గంజివారిపల్లి, కొర్రప్రోలు, యర్రగొండపాలెం, దోర్నాల ఎఫ్ఆర్‌ఓలు, కోఆర్డినేటర్ మంతన్న తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు మీ సేవకుడిగా ఉంటా..

- విజయం మనదే.. రెండు నెలలు కష్టపడండి
- ఆత్మీయ సమావేశంలో కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల
- దద్దాలను ఆదరించాలని చింతలచెర్వు విజ్ఞప్తి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దద్దాల, చింతలచెర్వు

పీసీపల్లి: ‘ఒక్క రెండు నెలలు సీఎం జగనన్న కోసం కష్టపడండి.. ఐదేళ్లు మీకు సేవకుడిగా ఉంటా... నియోజకవర్గంలోని ఒక్క ఓటు కూడా మిస్ కానీయొద్దు’ అని వైఎస్సార్ సీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పీసీపల్లి మండల పరిధిలోని చన వరిమడుగులో కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి దద్దాలతోపాటు ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, కనిగిరి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలచెర్వు సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ.. పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని వివరించారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుండటంతో పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను డబ్బుకు సైతం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రయాసపడిన తీరును గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారని, దళారీ వ్యవస్థ, అవినీతికి తావులేకుండా నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాల్లోనే పథకాల డబ్బు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నేతల మోసపూరిత మాటలు నమ్మితే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఆగిపోతాయని హెచ్చరించారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెర్వు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో కనిగిరి నుంచి పోటీ చేస్తున్న దద్దాల నారాయణను ఆదరించాలని కోరారు. పార్టీ శ్రేణులకు అండగా నిలిచే దద్దాలను గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా ఇద్దామన్నారు. కష్టాల్లో ఉన్న వారిని దద్దాల ఆదుకుంటాడన్న నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మరో మారు ఎన్నుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, నరేంద్ర చౌదరి, తిరుపతయ్య, నాగయ్య, బొర్రారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, పోలు జయరామిరెడ్డి, నరసింహారెడ్డి, ఎర్రంరెడ్డి మోహన్ రెడ్డి, మూలె రాజశేఖర్ రెడ్డి, అలవల నరసింహారెడ్డి, పరిమి వెంకట్రావ్, లింగాలదిన్నె నరసింహారెడ్డి, నరాల కొండారెడ్డి, మురుగమ్మి సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, మూలె గోపాల్, వెంగల్ రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, సీతారాంపురం సర్పంచ్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

174 మంది ఏహెచ్‌ఏల నియామకం

- నియామక ఉత్తర్వులు అందించిన కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్


నూతనంగా ఉద్యోగాలు పొందిన వారితో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, పశుసంవర్థక శాఖాధికారి

ఒంగోలు సెంట్రల్: రైతు భరోసా కేంద్రాల పరిధిలో నూతనంగా నియమితులైన యానిమల్ హెల్త్ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏ)లు మెరుగైన సేవలు అందించి గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కోరారు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చాటి నూతన రిక్రూట్‌మెంట్‌లో పోస్టులు సాధించిన 174 మందికి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పోస్టింగ్ ఆర్డర్స్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులు, పశుపోషకులకు మంచి సేవలు అందించి దేశంలోనే గుర్తింపు సాధించిందని అన్నారు. నూతనంగా ఉద్యోగాలు సాధించిన వారు మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ కే బేబి రాణి మాట్లాడుతూ ఈ రిక్రూట్‌మెంట్‌లో 177 పోస్టులకు గాను మెరిట్ ఆధారంగా 174 మంది ఎంపికయ్యారని చెప్పారు. అందులో ప్రకాశం జిల్లాలో 81 మంది, బాపట్ల జిల్లాలో 74 మంది, నెల్లూరు జిల్లాలో 19 మంది ఉన్నారని అన్నారు.